## క్లుప్తంగా

### మూలస్థాన ఎల్లమ్మకు పొంగళ్లు


ఆలయానికి వెళుతున్న భక్తులు

చంద్రగిరి : చంద్రగిరి గ్రామదేవత మూలస్థాన ఎల్లమ్మకు శుక్రవారం స్థానిక జమండ్లవీధికి చెందిన భక్తులు పొంగళ్లు సమర్పించారు. ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలు కాలి నడకన ఆలయం వద్దకు చేరుకున్నారు. అనంతరం పాల పొంగళ్లను పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జమండ్లవీధి పిన పెద్ద మొక్కల రాజా రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ డివిజన్ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు సీఎం కేశవులు, తానాటి చంద్ర, ఒడుగు లక్ష్మి పాల్గొన్నారు.

### ఫణికుమార్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ సివిల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థి వి.ఫణికుమార్‌కు శుక్రవారం డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ సీహెచ్ సుధారాణి పర్యవేక్షణలో ఆయన ‘డెవలప్‌మెంట్ ఆఫ్ అడాప్టీవ్ న్యూరో ఫుజ్జీ ఇన్‌ఫ్రాన్స్ సిస్టమ్ ఫర్ ప్రిడిక్షన్ ఆఫ్ సేఫ్ బియరింగ్ కెపాసిటీ ఆఫ్ క్లాయ్యే సోయిల్’ అనే అంశంపై పరిశోధన పత్రాలు సమర్పించారు.

### వ్యాధుల నియంత్రణకే డ్రై డే


మురుగు తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

చంద్రగిరి : సీజనల్ వ్యాధులను నియంత్రణకే డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈఓ మహేశ్వరయ్య తెలిపారు. శుక్రవారం స్థానిక దాసరవీధి, అక్కగార్లకాలనీలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. ఈఓ మాట్లాడుతూ వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. నీరు నిల్వ చేరితే దోమలు వ్యాప్తి చెందుతాయని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చని వెల్లడించారు. అనంతరం ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు డయేరియా, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు.

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

తిరుపతి అర్బన్ : గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి ఆదేశించారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ స్పెషల్ డ్రైవ్ పేరుతో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతోపాటు తాగునీటి సమస్యలకు పరిష్కారం, నీరు కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ మేరకు గ్రామీణులకు అవగాహన కల్పించేందుకు కరపత్రాలు, పోస్టర్లతో ప్రచారం చేయాలని సూచించారు.

### తిరుమలకు చేరుకున్న టీటీడీ అదనపు ఈఓ


అదనపు ఈఓ వెంకయ్య చౌదరికి స్వాగతం పలుకుతున్న టీటీడీ అధికారులు

తిరుమల/చంద్రగిరి : టీటీడీ నూతన అదనపు ఈఓ సీహెచ్ వెంకయ్యచౌదరి శుక్రవారం రాత్రి తిరుమలకు చేరుకున్నారు. స్థానిక స్పెషల్‌టైప్ అతిథిగృహం వద్ద ఆయనకు డిప్యూటీ ఈఓ ఆర్–1 హరీంద్రనాథ్, డిప్యూటీ ఈఓ లోకనాథం, ఓఎస్డీ సత్రే నాయక్ పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అజయ్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆయన తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకున్నారు.


వీరనారీమణులతో ఎన్‌సీసీ అధికారులు, క్యాడెట్లు


ఎంజీఎం ఉన్నత పాఠశాలలో అమరజవాన్లకు నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు, ఉపాధ్యాయులు


వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థుల ర్యాలీ


మొక్క నాటుతున్న ప్రిన్సిపల్ సత్యనారాయణ

# చరిత మరువదు మీ ఘనత

దేశ సేవలో తరించిన భారత సైనికుల పోరట పటిమను కొనియాడారు.. సరిహద్దు రక్షణలో ప్రాణాలర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.. మాతృభూమి రుణం తీర్చుకున్న జవానులకు ఘనంగా నివాళులర్పించారు..శత్రుమూకలను తరిమికొట్టి జయకేతనం ఎగురవేసిన రోజును పురస్కరించుకుని శుక్రవారం తిరుపతిలో ఘనంగా ‘కార్గిల్ విజయ్ దివస్’ నిర్వహించారు.. వీరనారీమణులను సత్కరించి, జ్ఞాపికలు బహూకరించారు.. ఎన్‌సీసీ క్యాడెట్లు పలు విన్యాసాలు ప్రదర్శించి దేశ సేవకు తాము సైతం సన్నద్ధమని స్పష్టం చేశారు.

- ఘనంగా కార్గిల్ విజయ్ దివస్
- అమరవీరులకు నివాళి
- వీర నారీమణులకు సత్కారం


కార్గిల్ వీరుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్న విద్యార్థులు

తిరుపతి సిటీ : దేశ రక్షణకోసం కార్గిల్ యుద్ధంలో శత్రుసేనలతో వీరోచిత పోరాటం చేసి అసువులు బాసిన వీర సైనికుల త్యాగం ఆదర్శనీయమని తిరుపతి ఎన్‌సీసీ గ్రూప్ కమాండర్ కల్నల్ యోగేష్ దుంగరకోటి తెలిపారు. శుక్రవారం స్థానిక ఎస్వీ వెటర్నరీ వర్సిటీలోని ఎన్‌సీసీ ఏఆర్ అండ్ వీ తిరుపతి ఎన్‌సీసీ రెజిమెంట్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్ 25వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ మాతృభూమిని రక్షించిచే క్రమంలో వీరమరణం పొందిన మన సైనికుల పరాక్రమాన్ని, త్యాగాన్ని స్మరించుకునే అవకాశం రావడం అదృష్టమన్నారు. ఆఫీసర్ కమాండింగ్ కల్నల్ ఎన్.ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీసీ క్యాడెట్‌లు వీరసైనికుల బాటలో నడిచి దేశసేవకు అంకితం కావాలని సూచించారు. ఎన్‌సీసీ క్యాడెట్లు ప్రదర్శించి విన్యాసాలు వీక్షకులను అలరించాయి. అనంతరం తిరుపతికి చెందిన ముగ్గురు అమరవీరుల సతీమణులనుఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. ఇందులో 1962ఇండో–చైనా యుద్ధంలో వీరమరణం పొందిన మద్రాసు రెజిమెంట్‌కు చెందిన సిపాయి పొన్నయ్య సతీమణి ఎస్తేర్, 1965 ఇండో–పాక్ యుద్ధంలో ప్రాణాలర్పించిన లాన్స్ నాయక్ కన్నయ్య సతీమణి సరస్వతి, 1988 అక్టోబర్‌లో శ్రీలంక ఎల్‌టీటీఈ తీవ్రవాదులతో పోరాడి భరతమాత ఒడిలో ఒరిగిన వీరసైనికుడు నాయక్ జొల్లు రెడ్డెప్పరెడ్డి సతీమణి రమణమ్మ ఉన్నారు.

**అమరవీరుల స్తూపం వద్ద..**

తిరుపతి గాంధీరోడ్ : తిరుపతిలోని అమరవీరుల స్తూపం వద్ద కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. బీజేపీ నేతలు గుండాల గోపీనాథ్ రెడ్డి, పెనుబాల చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన భారత సైనికులను దేశ ప్రజలందరూ గుర్తించుకుంటారని తెలిపారు. మాజీ సైనికుడు ఆనందరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, మల్లారపు రవిప్రసాద్, ఫణిభూషణ్ రెడ్డి, మస్తాన్ పాల్గొన్నారు.

**ఎస్‌జీఎస్‌లో..**

ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలోని ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివాస్‌ను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ సత్యనారాయణ మాట్లాడుతూ అమరవీరుల త్యాగాన్ని సమ్మరించుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతన్నారు రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్ మార్కండేయులు సన్మానించారు.

**వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో..**

తిరుపతి కల్చరల్ : సి.రామాపురంలోని వెరిటాస్ సైనిక్ పాఠశాల విద్యార్థులు కార్గిల్ వీరులకు ఘన నివాళులర్పించారు. ముందుగా తిరుపతిలోని వినాయక నగర్ మైదానం నుంచి సైనిక్ బ్యాండుతో 175 మంది విద్యార్థులు ఎన్‌జీవో కాలనీలోని అమరవీరుల స్తూపం వరకు కవాతు నిర్వహించారు. పాఠశాల అధినేత డాక్టర్ బి.శేషారెడ్డి అమరవీరుల స్థూపానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు శ్రీకర్‌రెడ్డి, సందీప్‌రెడ్డి, డీన్ సీజేహెచ్.ఖాన్, ప్రిన్సిపల్ డాక్టర్ పీఆర్ఎస్ చక్రవర్తి పాల్గొన్నారు.

**ఎంజీఎం పాఠశాలలో..**

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి బైరాగిపట్టిడలోని ఎంజీఎం నగరపాలక ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు నిర్వహించారు. 29 ఆంధ్ర బెటాలియన్ హవల్దార్ ప్రకాష్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ దేశం పట్ల గౌరవ కలిగి ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం రవికుమార్, ఎన్‌సీసీ అధికారి కదిరి రవి, ఉపాధ్యాయులు మునిశారద, మధుసూదన్‌రెడ్డి, హేమాద్రిబాబు, శ్రీలక్ష్మీ, యామిని, తులసీ ప్రకాష్, భాస్కర్, పీడీ ప్రసన్నలక్ష్మి పాల్గొన్నారు.

**ఎస్వీ జూనియర్ కళాశాలలో..**

ఎస్వీ జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ 28 ఆర్మీ బెటాలియన్ ఇన్‌చార్జి సీటీఓ ఈ.లోకేష్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సి.ప్రకాష్‌బాబు, అధ్యాపకులు పి.ప్రియవర్ధనబాబు, కె.కృష్ణకిశోర్, డాక్టర్ సీఎల్ చెన్నారెడ్డి, కె.సోమశేఖర్, డాక్టర్ మధు, చిన్నకేశవులు పాల్గొన్నారు.

## పనికి తగిన వేతనం కోసం వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మికులు

తిరుపతి అర్బన్ : పనికి తగిన వేతనం ఇప్పించాలని రుయా ఆస్పత్రి పారిశుద్ధ్య కార్మికులు కోరారు. శుక్రవారం ఈ మేరకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాధాకృష్ణ ఆధ్వర్యంలో కలెక్టర్ వెంకటేశ్వర్‌కు వినతిపత్రం అందించారు. కార్మికులు మాట్లాడుతూ పనిభారం విపరీతంగా పెరిగిపోయిందని, 230 మంది విధులు నిర్వర్తించాల్సిన చోట 90 మంది మాత్రమే ఉన్నామని వెల్లడించారు. అయితే కాంట్రాక్టర్ మాత్రం అందరూ పనిచేస్తున్నట్లు బిల్లులు పెట్టేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ప్రశ్నిస్తే ఆస్పత్రి అధికారులకు మామూళ్లు ఇస్తున్నట్లు చెబుతున్నారని వివరించారు. తమ సమస్యలను ఆస్పత్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళితే, మా మధ్యే తగాదాలు పెట్టేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో విచారణ చేయించి కార్మికులకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్టా మహేంద్ర, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శులు సీహెచ్ శివకుమార్, వైఎస్ మణి, కార్మిక సంఘం నేతలు సునీల్, జ్యోతి, రమాదేవి, బుజ్జమ్మ, మంజుల, దేవి పాల్గొన్నారు.

### వృద్ధులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

పాకాల : పూతలపట్టు మండలం నడింపల్లెలోని హరేరామ హరేకృష్ణ వృద్ధాశ్రమంలో శుక్రవారం పాకాలకు చెందిన లయన్ కుప్పుస్వామి తన మనవరాలు లిషిఆధ్యా పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేపట్టారు. లయన్స్ క్లబ్ సభ్యులు మాట్లాడుతూ న్యూజీలాండ్‌లో స్థిరపడిన లిషిఆధ్యా తల్లిదండ్రులు మాలేపాటి యశస్విని, శివరామ్ ఏటా తమ కుమార్తె జన్మదినం సందర్భంగా అన్నదానం చేస్తుంటారని వెల్లడించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు తులసీరామన్, సభ్యులు విజయబాబు, జయరామనాయుడు, దామోదర్‌నాయుడు, దొరస్వామినాయుడు, భాస్కర్‌శెట్టి, భాస్కర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

## బ్లాక్‌మెయిలర్లపై చర్యలు తీసుకోండి

తిరుపతి తుడా : కొంతమంది తనను బ్లాక్ మెయిల్ చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌ఓ శ్రీహరి ఆరోపించారు. శుక్రవారం ఈమేరకు కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడుకు ఫిర్యాదు చేశారు. ఓ సంస్థ పేరుతో కొంతమంది రూ.5 లక్షలు డిమాండ్ చేశారని పేర్కొన్నారు. డబ్బులు ఇవ్వని పక్షంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని డిమాండ్ చేసినట్లు తెలిపారు. తన ఇంటికి వచ్చి బ్లాక్ మెయిల్ చేసి, బెదిరించారని చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో వాయిస్ రికార్డులను కలెక్టర్, ఎస్పీలకు అందజేసినట్లు వెల్లడించారు.

### టీటీడీ అదనపు ఈఓకు సత్కారం


ఏఈఓను సన్మానిస్తున్న ఉద్యోగులు

తిరుపతి(అలిపిరి): టీటీడీ అడిషనల్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమితులైన వెంకయ్య చౌదరిని శుక్రవారం రేణిగుంట విమానాశ్రయంలో టీటీడీ ఎంప్లాయిస్ అసోసియేషన్ నేతలు శుక్రవారం ఘనంగా సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్, ఉపాధ్యక్షుడు సునీల్‌కుమార్ యాదవ్, కోశాధికారి గుంటూరు రేఖ, మణికంఠ, ఈశ్వర్ నాయక్, నాగరాజు పాల్గొన్నారు.

### బ్యాలెట్ విధానంలో ఎన్నికకు వినతి

తిరుపతి సిటీ : ఎస్వీయూ నాన్‌టీచింగ్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్, జాయింట్ సెక్రటరీ, ట్రెజరర్ పదవులకు బ్యాలెట్ పద్ధతి ద్వారా ఎన్నిక నిర్వహించాలని ఈసీ మెంబర్ ఆదిశేషయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ మేరకు వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడులకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన నాన్‌టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పెద్దలు జాయింట్ సెక్రటరీ, వైస్ ప్రెసిడెంట్, ట్రెజరర్ పదవులను ఏకగ్రీవంగా ప్రకటించడం నిబంధనలకు విరుద్ధమని ఆవేదన వ్యక్తం చేశారు.

## ‘జిందాల్’ సేవలు అభినందనీయం




కలెక్టర్‌కు పరికరాలు అందిస్తున్న శ్రీనివాసరావు, మ్యాథ్యూస్

తిరుపతి అర్బన్ : జిందాల్ పవర్ లిమిటెడ్ సింహపురి యూనిట్ వారి సేవలు అభినందనీయమని కలెక్టర్, తిరుపతి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్‌సీఎస్) చైర్మన్ వెంకటేశ్వర్ కొనియాడారు. శుక్రవారం కలెక్టరేట్ వద్ద ఐఆర్‌సీఎస్‌కు రూ.12లక్షల విలువైన రక్త నిధి పరికరాలను కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఎయిర్ కండీషనర్లు, కంప్యూటర్, ప్రింటర్ తదితర పరికరాలను జిందాల్ సంస్థ అందించింది. కార్యక్రమంలో జిందాల్ యూనిట్ ప్రతినిధి కె.శ్రీనివాసరావు, సీఎస్ఆర్ ప్రతినిధి జోబిన్ మ్యాథ్యూస్, లైసెన్సింగ్ అధికారి ఖలీల్, ఐఆర్సీఎస్ తిరుపతి జిల్లా బ్రాంచ్ వైస్ చైర్మన్ బి.శ్రీకాంత్ రెడ్డి, సెక్రటరీ డాక్టర్ జి.ప్రతీత్, మేనేజింగ్ కమిటీ సభ్యులు శివకుమార్, సుధీర్, గుణశేఖర్, శాశ్వత సభ్యులు రత్నప్రభ పాల్గొన్నారు.

### నేటి నుంచి ‘టేప్ ఎక్స్‌పో’


మాట్లాడుతున్న వెంకటేష్‌బాబు

తిరుపతి కల్చరల్ : ప్లానర్స్ అండ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శని, ఆదివారం రెండు రోజులపాటు తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో టేప్ ఎక్స్‌పో–2024ను నిర్వహించనున్నట్లు అసోసియేషన్ చైర్మన్, అధ్యక్షుడు కె.వెంకటేష్‌బాబు, ప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. మారుతున్న కాలనీకి అనుగుణంగా నిర్మాణ రంగంలో వస్తున్న ఆధునిక టెక్నాలజీపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కల్పించేందుకే ఏటా టేప్ ఎక్స్‌పో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ప్రదర్శనలో బిల్డింగ్ కన్‌స్ట్రక్షన్స్ అండ్ మ్యానుఫ్యాక్చర్స్‌కి సంబంధించిన అన్ని రకాల ప్రాపర్టీస్, మెటీరియల్స్, టెక్నాలజీస్, మెషినరీ అండ్ ఎక్విప్‌మెంట్ ఎగ్జిబిషన్‌తో పాటు ఎక్స్‌పర్ట్‌లతో పరిచయ, అవగాహన సౌకర్యాలను కల్పిస్తున్నట్లు తెలిపారు. సందర్శకులకు లక్కీడిప్ ద్వారా ఆకర్షణీయమైన బహుమతులు అందజేయనున్నట్లు వివరించారు. సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి షణ్ముగం పాల్గొన్నారు.

### పద్మగిరిగుట్టకు ఆడికృత్తిక శోభ

తిరుపతి రూరల్ : మండలంలోని తనపల్లెలో ఉన్న పద్మగిరి గుట్టపై కొలువైన శ్రీదండాయుధపాణి స్వామి వారి ఆలయం ఆడికృత్తిక శోభతో అలరారుతోంది. కావడి మహోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం 8 గంటలకు ధ్వజారోహణం, ఆదివారం ఉదయం 6 గంటలకు భరణి అభిషేకం, సోమవారం ఆడికృత్తిక నేపథ్యంలో ఉదయం 6.30 గంటల నుంచి భక్తులకు సర్వదర్శనం కల్పిస్తున్నట్లు అర్చకుడు షణ్ముగస్వామి తెలిపారు.

విద్యుద్దీప కాంతుల్లో ఆలయం



## అడుగడుగునా అవమానం



“ఏయ్ ఎవరు నువ్వు.. బుద్ధుందా నీకు.. కడుపుకి ఏం తింటున్నావ్.. మనిషివేనా నువ్వు” ఇదీ ప్రతిష్టాత్మక బర్డ్ ఆస్పత్రిలో సెక్యూరిటీ సిబ్బంది మాటతీరు. సుదూర ప్రాంతాల నుంచి చికిత్స కోసం వచ్చిన రోగులకు ఇక్కడ అడుగడుగునా అవమానాలే. ఆస్పత్రి గడప నుంచి ఓపీ కౌంటర్.. స్కానింగ్ సెంటర్ వరకు ప్రతి చోటా చీదరింపులే. ముఖ్యంగా సెక్యూరిటీ సిబ్బంది బెదిరింపులకు రోగులు భయాందోళనకు గురయ్యే పరిస్థితి. వారిని ప్రసన్నం చేసుకునేందుకు గంటల తరబడి గేటు వద్దే నిలబడాల్సిన దుస్థితి. బూతులతో కూడిన తిట్ల పురాణం వినలేక చెవులు మూసుకోవాల్సిన దయనీయస్థితి. ఈ క్రమంలోనే శుక్రవారం హైదరాబాద్ నుంచి ఇద్దరు సహాయకులతో ఓ రోగి కీళ్ల మార్పిడి చికిత్స కోసం బర్డ్‌కు వచ్చారు. ఎలాగోలా ఓపీ కౌంటర్ వరకు చేరుకున్నారు. తీరా ఓపీ తీసుకునే క్రమంలో సెక్యూరిటీ ఛీత్కారానికి భంగపడ్డారు. దీనిపై రోగి సహాయకుడు శ్రీనివాస్‌కుమార్ ‘సాక్షి’తో మాట్లాడారు. సెక్యూరిటీ వ్యవహారశైలి దుర్మార్గంగా ఉందని ఆరోపించారు. చేయి చూపిస్తూ కొట్టేందుకు వచ్చాడని వాపోయారు. టీటీడీ నిర్వహిస్తున్న ఆస్పత్రిలో సిబ్బంది ఇలా అమర్యాదగా మాట్లాడడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని సూచించారు.

– తిరుపతి తుడా

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరుపతి రూరల్ : తిరుపతి నగరంలోని పలు సబ్ స్టేషన్లలో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఎస్పీడీసీఎల్ ఈఈ వాసుదేవరెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొర్లగుంట, మధురానగర్, రైల్వే కాలనీ, భవానీ నగర్, సుందరయ్యనగర్, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, తుడా రోడ్డు, తిలక్‌రోడ్డు, వీవీ మహల్‌రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.




## అణువణువునా ఆక్రోశం

రాయలసీమలోనే అతిపెద్ద ప్రభుత్వాస్పత్రి.. అందుబాటులో అత్యాధునిక పరికరాలు.. అత్యంత నిపుణులైన వైద్యులు.. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్టుగా మారింది ప్రతిష్టాత్మక రుయా ఆస్పత్రి పరిస్థితి. ఇక్కడకు నిత్యం వేల సంఖ్యలో రోగులు వస్తుంటారు. చికిత్స నిమిత్తం పలువురు డాక్టర్ల ఎదుట బారులు తీరుతుంటారు. అయితే ఆస్పత్రిని సందర్శిస్తే అణువణువునా రోగుల ఆక్రోశమే కనిపిస్తుంది. పట్టించుకునే వారు ఉండరు. సరైన సమాచారం ఇచ్చే వారు ఉండరు. ఎక్కడ ఓపీ తీసుకోవాలో.. ఎక్కడ వైద్యుడిని కలవాలో.. ఎక్కడ స్కానింగ్ తీయించుకోవాలో అర్థం కాదు. ఆస్పత్రి సిబ్బందిని కదిలిస్తే కరిచే సేట్టుంటారు. ఎక్కడ చూసినా చాంతాడంత క్యూ కనిపిస్తుంది. ఏ విభాగానికి వెళ్లినా రోగులతో కిటకిటలాడుతుంటుంది. చివరకు మందులు తీసుకోవాలన్నా గంటల తరబడి క్యూలో నిలబడాల్సి ఉంటుంది. పేరుకు పెద్దాస్పత్రి కానీ.. సేవలు మాత్రం నేతిబీర కాయలో నెయ్యి అన్న చందంగా మారిపోయింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

మందుల కోసం..


స్కానింగ్.. ఎక్స్‌రే కోసం
